# ● కొత్త రచయితలు 'ప్రేమ-బహుమతి'

- ఎస్సెన్మూర్తి



●● 'త్వరగా కానీయ్'

అన్న కేకవిని మరింత వేగంగా కాన్వాసు పై రంగులు పులుమసాగాను. చేతులు యాంత్రికంగానే పని చేస్తున్నా మనసు నిండా మాత్రం నేనే వున్నానన్నట్లు మళ్ళీ అదే ఆకృతి. అస్పష్టంగా కాన్వాసుపై రూపుదిద్దుకోసాగింది. అవును. ఆ ఆకృతి రేఖదే.

లోకమంతా బంగారు కిరణాలను వల్లుతూ గర్వంగా ఉదయిస్తున్న సూర్యున్ని ధిక్కరిస్తూ నువ్వు సూర్యబింబం అయితే నేను చంద్రబింబం అంటే అలవోకగా పైట కొంగు తెరచాపలా ఎగురుతుండగా నడుస్తున్న రేఖ.

ఒక్కసారి నా రేఖను చూసిన వారెవరైనా నిర్ద్వంద్వంగా అది రేఖ చిత్రమే అని చెప్పగలరు.

గబగబా చిత్రాన్ని పూర్తి చేసి స్టాండునుండి తీసి ఎండకభిముఖంగా పెట్టాను. మరో కాన్వాసు గుడ్డను తీసుకొని స్టాండుకు బిగించాను.

రంగులు ఆరిపోయిన 'రేఖ' చిత్రాన్ని కాగితంతో చుట్టి ఆ జంటకు అందించాను. ఆమె ఆ చిత్రాన్ని అత్యంత భద్రంగా పట్టుకోగా అతడు పర్సులోంచి పది రూపాయిల నోటు నొకదానిని తీసి నిర్లక్ష్యంగా అందించాడు.

మౌనంగా తీసుకున్నాను. అది నా కాన్వాసు మరియు రంగుల ఖర్చుకన్నా తక్కువే. కానీ నేనింకా ఇంత ఇవ్వు అని అడుగలేను. నాకు తెలుసు అతడు ఈ చిత్రాన్ని ఎన్ని వందలో పెట్టి ఫలానా ఎగ్జిబిషనులో కొన్నానని ఎన్నో గొప్పలు చెప్పుకుంటాడు.

రేఖ అంటూండేది."పెళ్ళయ్యాక నీ బొమ్మలన్నీ కలిపి ఎగ్జిబిషన్ పెట్టేస్తా. అప్పుడు వేలం వేసి మరీ కొనుక్కుంటారీ జనం నీ బొమ్మలని. ఒకప్పటికి నువ్వు నంబర్ వన్ చిత్రకారుడు వవుతావు. ఒకింట్లో నీ బొమ్మ వుండడం స్టేటస్ సింబల్‌గా మార్చకపోతే అప్పుడడుగు."

ఇప్పుడెక్కడుందో ఆ రేఖ. ఇప్పటికి ఎన్ని బొమ్మలు వేశాడో తను. ఎంతని అడిగిన వాళ్ళకు దీని ధర ఇంత అని చెప్పకోలేను. ఎలా చెప్పగల ను. నా ప్రేమ దేవత నా జీవిత సర్వస్వం ఆ బొమ్మలో కనబడుతుంటే దానికి నేనెలా ఖరీదు కట్టగలను.

అందుకే అడిగిన వాళ్ళకి బొమ్మ ఇచ్చి వేయడం. ఇచ్చినంత డబ్బు తీసుకోవడం. మళ్ళీ ఇంకొక బొమ్మ వేసుకోవడం.

"ఎన్ని రోజులైందో రేఖను చూసి"

అవి రోజులా, యుగాలా- ప్చ్ రేఖను చూసి ఎన్ని రోజులు అవడమేమిటి.

రేఖ ఎల్లప్పుడూ నా కళ్ళల్లో, నా ఆలోచనల్లో, ఒక్క క్షణం కూడా నన్ను వదలకుండా నాతోనే కాపురముంటే.

ప్రతిరోజూ నా కుంచేతోనే కదా రేఖ ఒక్కొక్క రకంగా ముస్తాబయ్యేది. ఆలోచనలలో మునిగిపోయిన నేను ఒక

కున్రాదు నా చేయి పట్టి లాగడంతో ఈ లోకంలోకి వచ్చాను. "ఏమిటీ" అని అడిగేంతలో ఆ కారులో వచ్చిన ఆమె నీకీ లెటరు ఇచ్చింది అంటూ. పోతూన్న ఒక కారును చూపుతూ నా చేతిలో ఆ లెటరు వుంచి. బీచిలోకి పరుగులు తీశాడు.

ఆ ఉత్తరం మీద నా పేరు అందంగా వ్రాసి వుంది.

ఎవరైవుంటారు. అసలునాకు ఉత్తరం వ్రాసేవారెవరున్నారని.

మెల్లిగా ఉత్తరం చింపి చదవసాగాను.

"మాధవా

గుర్తున్నాను కదూ, నేను నీ రేఖని.

నా ఊపిరి, నా ప్రాణం అన్నీ నీవేనంటూ నీ చుట్టూ తిరిగిన నీ రేఖని

నీవు తప్ప ఇంతవరకూ అవసరం లేదని, నీ మాటే నాకు వేదమనీ, బాసలు చేసిన రేఖను. నా కోసం 'ఎందుకూ అని అడుగకుండా నేనేం చెయ్యమంటే అది చేస్తావా'అని అడిగితే 'ఎందుకు చెయ్యనూ'అని అన్ని దేవతల మీద కలిపి ఒట్టు పెట్టుకొంటే'కాదు నా మీద ఒట్టేసి చెప్పు'అని నువ్వు అన్నప్పుడు తడుము కోకుండా నీ మీద ఒట్టేసి చెప్పిన నీ రేఖనే.

ఆ రోజు గుర్తుంది కదూ. నా తల్లి దండ్రులు నా ప్రమేయం లేకుండానే తోటి వ్యాపారస్తుని కొడుక్కు నన్నిచ్చి పెళ్ళి చెయ్యడానికి ఎనిమిది రోజులలో ముహూర్తం నిర్ణయించిన రోజు. మధ్యాహ్నం నీకు కబురంపించి సాయంత్రం పార్కులో నీ కోసం పడిగాపులు కాస్తుంటే ఒక్కరోజు కాదు, ఏడు రోజులు వరుసగా ఏడు సాయంత్రాలు నీ కోసం ఎదురు చూస్తుంటే తెల్లారితే పెళ్ళి అనగా కూడా నీ కోసం పార్కులో చీకటి పడేదాకా ఎదురుచూసిన రోజు.

నా బ్రతుకులోకి శాశ్వతంగా చీకట్లు కమ్ముకొస్తున్న వేళ ఏమన్నావు నీవు గుర్తుందా 'రేఖా నా పెళ్ళి అనుకోని పరిస్థితులలో జరిగిపోయింది. నా మీద నీకు ఏ మాత్రం ప్రేమ వున్నా నాకిచ్చిన మాట ప్రకారం నీ తల్లి దండ్రులు కుదర్చిన పెళ్ళి చేసుకో'' అంతే కదూ.

ఈ మాటలని నన్ను చీకట్లో అట్లే వదిలి వేసి వెళ్లావు కదా!

ఆ రేఖనే నేను.

నన్ను చేసుకొన్న వరుడు నీకన్నా అన్ని విధాలా అధికుడు. అగర్భ శ్రీమంతుడు. అందమైన భార్యని కలిగి వుండడం కూడా ఒక స్టేటస్ సింబల్‌గా భావించే సంస్కారం కలిగిన వ్యక్తి. ఈనాడు నేనెటు పోవాలన్నా కాలు తీసి క్రింద పెట్టకుండా కార్లలోనే పోగలను. నేను కోరిన దేదైనా క్షణాలలో నా ముందుంచడానికి ప్రయత్నించే మావారు.

నా జీవితంలో ఇప్పటి వరకూ ఏ లోటూ లేదు. ఒక్కటి తప్ప అదేమిటంటే ఒక రకంగా ఈనాడు నేననుభవిస్తున్న అన్ని సుఖాల కూ కారణం నీవే కనుక నీ ఋణం తీర్చుకోవడం.

అందుకే సాయంత్రం 5 గంటల తర్వాత హోటల్ సవేరా రూ.నెం. 628కి రా. నీ జీవితంలో నువ్వెప్పుడూ ఊహించని అపురూపమైన బహుమతిని నీకిస్తాను.

ఒకటి చెప్పనా. నువ్వు నన్నెన్నో రకాలుగా చిత్రించావు కదూ. ఇప్పుడు నువ్వు వస్తే నువ్వు జీవితంలో ఊహించని విధంగా నీకు ఒక విలక్షణమయిన విధానంలో కనిపిస్తాను. నీకు చేతనైతే నన్ను అలా చిత్రించడానికి ప్రయత్నించు.

ఇట్లు

ఒకప్పటి నీ రేఖ అని వ్రాయనా.

ఎప్పటికీ నీ రేఖనే అని వ్రాయనా."

ఉత్తరం అందిన వెంటనే గబగబా రంగు డబ్బాలను బ్రష్‌లనూ పేక్ చేసి స్టాండ్‌ను మోసుకుంటూ రూమ్‌కు బయలుదేరాను. తలుపు తీయగానే చిరునవ్వులు చిందిస్తూ ఎదురుగ్గా రేఖ.

రేఖ వర్ణచిత్రం. చిరునవ్వులు నవ్వుతూన్నట్లుగా వుంది.

ఈ చిరునవ్వుల వెన్నెలలో స్నానాలాడి ఆరేళ్ళే కదా అయింది అప్పుడే ఆరుయుగాలు గడిచినట్లుగా అనిపిస్తోంది!

ఏమిస్తుందబ్బా బహుమతి! రేఖను నేనింత వరకూ చిత్రించని భంగిమ ఏదన్నా వుందా!

నీ రూం తట్టగానే నన్ను చూసిన ఆనందంతో మాటలు రాకుండా నువ్వుంటే నీ అడుగులో అడుగువేస్తూ వచ్చిన ఓ చిన్నారి పాప కొంగు గుంజుతూ మమ్మీ ఎవరీ అంకుల్ అంటుందా.

అయినా నువ్వు నాకు వేరే బహుమతి నివ్వడమేమిటి! నాకు జీవితంలో నీతో మాట్లాడడం కంటే వేరే ఆనందమైనది ఇంకేదైనా వుందా?

బలవంతంగా ఆలోచనలను తెంపుకుంటూ తొందరగా తయారై నా రూంకు తాళం వేయబోతూ ఒక్కసారిగా ఆగిపోయాను. ఎదురుగా నేనెప్పుడో వేసిన చిత్రం. రేఖను నేను మొదటి సారి చూసినప్పుడు వేసిన చిత్రం.

రేఖకు నచ్చిన నా మొట్టమొదటి కాన్వాసు చిత్రం.

అందమైన సముద్ర తీరం. సముద్రంలో సూర్యుడు అస్తమిస్తూ తడిసిన ఇసుక తిన్నెకు ఎరుపు రంగు రాసు కొంటూ పోతుంటే ఏదో దూర తీరాలకు ఎగిరిపోతున్న ఒంటరి పక్షి.

రేఖ ఎప్పుడూ అనేది. అదే చిత్రంలో ఇంకొక పక్షిని కూడా వేసి దాన్ని ఎగిరిపోతున్న ప్రేమ జంటగా మారిస్తే ఎంతో అద్భుతంగా వుంటుంది అని. కాని నేను మాత్రం దాన్ని ప్రియురాలి అన్వేషణలో వున్న మగ పక్షి అని అనే వాణ్ని.

గబగబా ఆ చిత్రాన్ని గోడ నుండి తీసి రంగు కాగితంతో అందంగా చుట్టి రూం లాక్ చేసి ఆ ప్యాక్‌తో బయటపడ్డాను.

మనసులో ఎన్నో ఆలోచనలు. జీవితం ప్రారంభం నుంచీ రేఖతో కలిసి ఎన్నెన్ని రంగుల కలలు. రేఖ తండ్రి తన దగ్గరకు వచ్చే వరకూ అన్నీ పంచ రంగుల కలలే. ఆ రోజు కదా తెలిసింది బంగారు చెంచా నోటిలో పెట్టుకొని పుట్టిన రేఖను తన తండ్రిని ఎదిరించి చేసుకొన్నా ఏమి సుఖపెట్టగలను! నెలలో నాకు వచ్చే సంపాదనంతా ఆమె ఒక్క రోజు అలంకరణకూ సరిపోదని.

రేఖ తండ్రి చెప్పిన మాట వినే కదా నా అంతస్తేమిటో నాకు తెలిసింది. రేఖ మీద నాకున్న ప్రేమనంతా మనసులో దాచుకుని వాళ్ళ తండ్రి చెప్పినట్లుగానే ఒకే ఒక అబద్ధంతో రేఖ పెళ్ళి జరిగేలా చేసింది.

లేకుంటే ఈ రోజు ఈ షెడ్డు లాంటి ఒకే ఒక గదిలో రోజుకొక్క పూట తిండి కూడా సరిగా సంపాదించుకోలేని నాతో ఎంత దుర్భరమైన జీవితాన్ని గడపవలసి వచ్చేది.

ఒక్కసారిగా మ్రోగిన హారన్ చప్పుడు నన్ను నా ఆలోచనల నుండి బయటకి లాగేసింది. అప్పటికే ఆరంతస్తుల 'సవేరా'ను దాటిన నేను వెంటనే రోడ్డు క్రాస్ చేసి వేగంగా వెనక్కి నడుస్తూ హోటల్‌లోకి అడుగు పెట్టాను.

ఇదే మొదటి సారి నాకు స్టార్ హోటల్‌లో అడుగు పెట్టడం. రిసెప్షనిస్ట్ సహాయంతో లిఫ్టులోకి ప్రవేశించి ఆరవ నంబరు బటన్ నొక్కి నిలబడ్డాను. లిఫ్టు పైకి పోయిన కొలదీ నా గుండె కొట్టుకోవడం మరీ ఎక్కువ కాసాగింది. లిఫ్టు ఆగగానే నాలో ఉద్వేగాన్ని బలవంతాన అణచుకుంటూ వరండాలోకి వచ్చాను.

నంబర్లు చూసుకుంటూ 628 రూం ముందు నిలబడ్డాను. నా గుండె వేగం మరింత హెచ్చింది.

కాలింగ్ బటన్ నొక్కి ప్రక్క గోడకు ఆనుకుని నిలబడ్డాను. ఎంతకీ బదులురాక పోవడంతో ఎలాగో గుండెను చిక్కబట్టుకొని కొద్దిగా తెరచివున్న తలుపులను తోసుకుంటూ లోపలికి ప్రవేశించాను. అదే మొదటిసారి నాకు అంత ఖరీదైన అలంకరణతో వున్న గదిని చూడటం.

అందులో ఎవరూ లేరు.

ఏటువంటి చప్పుడూ వినిపించడం లేదెందుకని.

"రేఖా" అంటూ ప్రక్కనున్న తలుపులు తట్టుకుంటూ కుడి ప్రక్క గది లోపలికి తొంగి చూశాను.

అది గది కాదు.

అది సముద్రాన్ని చూడటానికి బాల్కనీగా విశాలంగా వున్న భాగం. ఎదురుగా అస్తమిస్తున్న సూర్యుడు. సముద్ర తీరాన్నంతటినీ సింధూరం పూత పూస్తున్నట్లు. ఎంతో మనోజ్ఞంగా వుంది. బాల్కనీలో ఒక ప్రక్కగా గాజు టేబుల్. దాని చుట్టూ నాలుగు వెదురు కుర్చీలు.

నా చేతిలోని చిత్రాన్ని ప్యాక్ విప్పి ఆ టేబిల్‌పై దించబోతూ చూశాను. టేబుల్ మీద నా పేరు వ్రాయబడ్డ లెటర్ పేపర్ వెయిట్ క్రింద రెప రెప లాడుతూ వుంది.

మెల్లిగా చిత్రాన్ని టేబిల్ మీద పరచి పేపర్ వెయిట్‌ను దాని మీద వుంచి ఉత్తరాన్ని నా చేతిలోకి తీసుకున్నాను.

సముద్రం మీది నుండి వచ్చే గాలి ఒక్కసారి విసురుగా వీచే సరికి నా చేతిలోని ఉత్తరం ఎగిరిపోయింది.

ఒక్క గెంతులో దాన్ని అందిపుచ్చుకుని గట్టిగా పట్టుకొన్నాను. రెప రెపలాడే గాలికి కళ్ళ మీదికి వస్తున్న వెంట్రు

కలను పైకి తోసుకుంటూ బాల్కనీ రెయిలింగ్‌కు ఆనుకొని నిలబడి లెటర్ విప్పాను. బాల్కనీలోని నీలి రంగు పరదాలకున్న చిరు గజ్జెలు గాలికి పరదాలు అలలుగా కదులుతూండటంతో ఎంతో శ్రావ్యమైన శబ్దాన్ని సృష్టిస్తున్నాయి.

అద్భుతమైన ప్రదేశం

ఎంతో ప్రశాంత వంతమైన సమయం

ఇన్నివాళ్ళ తర్వాత జీవితంలో నాకున్న ఒకే ఒక ఆత్మీయురాల్ని ఇంత మంచి తరుణంలో కలుసుకోబోతున్న ఆనందంతో సంతోషం పట్టలేక మనసు ఆకాశంలోకి స్వేచ్ఛా విహంగంలా ఎగురసాగింది.

బాల్కనీ రెయిలింగ్‌కు ఆనుకునే ఒక ప్రక్కగా తిరిగి చూశాను. నాకు ఎడమ వైపు అంతులేని సముద్రం. కుడి వైపు అద్భుతమైన బాల్కనీ గది ఎదురుగా హోటల్ క్రిందుగా.

ఎంతో క్రిందుగా పొడవైన రోడ్డు మీద వరుసగా పోతున్న వాహనాల లైట్ల చమ్కీల దండలా మెరుస్తున్నాయి.

చిత్రకారుడెవరైనా తన మనస్సు అనే కాన్వాసుపై ఇటువంటి సజీవ చిత్రాన్ని ఒక్కసారైనా చిత్రించాలని కలలుగనే దృశ్యం.

రేఖ ఎటు పోయింది చెప్మా!

అయినా రమ్మని పిలిచి మళ్ళీ లెటర్ వ్రాయడమేమిటి నా మనస్సును పూర్తిగా లెటర్ మీద లగ్నం చేశా.

"ఏయ్ మాధవా!

నిజంగా నువ్వు ఎంత మూర్ఖుడివి. ఆరేళ్ళ తరువాత ఈ వూరు రాగానే నిన్ను వెతుక్కుంటూ వచ్చిన నాకు నీ గదిలో కాదు గుడిలో ఎటు చూసినా నా రూపమే దేవతా ప్రతిమలా కనిపిస్తుంటే నువ్వు అసలు పెళ్ళి చేసుకోలేదనీ, నువ్విన్నాళ్ళూ నా ఆలోచనలతోనే బ్రతుకుతున్నట్లు అర్థమైంది.

ఎంత ప్రేమను కోల్పోయాను నేను.

నాపై నీకున్న (నీపై నాకున్న) ప్రేమ నంతటినీ ఒకే ఒక్క అబద్ధంతో ఎందుకూ కొరగాకుండా చేశావు కదూ.

ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే ప్రేమ విహంగాన్నైన నన్ను ఒకే ఒక్క అబద్ధంతో బంగారు పంజరంతో బందీని చేశావు కదూ.

నువ్వు నిజంగా పెళ్ళి చేసుకుని వున్నా, ఇన్నేళ్ళలో నన్ను మరిచిపోయి వేరే వ్యక్తిని ఆ తర్వాతనైనా పెళ్ళి చేసుకుని వుంటే నిన్ను క్షమించగలిగే దాన్నేమో.

మనసులో ఎన్నెన్నో కలలు కని క్రమేణా ఆ కలలు కల్లలై నిట్టూర్చే ఎంతో మంది ఆడపిల్లలలో నేనూ ఒకదాన్ని అనుకునేదాన్నేమో.

కానీ ఇప్పుడు మాత్రం అలా అనుకోలేను. అలా అని జీవితాంతం నిన్ను మరచిపోలేకా, తిరిగి నా భర్తతో యాంత్రికంగా మామూలుగా బతుకలేక, సారీ.

అందుకే ఏ అబద్ధంతో నువ్వు నన్ను శిక్షించావో, ఆ అబద్ధమే నీ ప్రాణమైన రేఖ ప్రాణాల్ని బలి తీసుకుందనీ, నువ్వు నిరంతరం కుళ్ళిపోవాలి. బ్రతికుండగానే చిత్రవధ అనుభవించేలా! అందుకే,

ఇన్నాళ్ళూ నా బొమ్మల్ని గీసుకొంటూనైనా మనస్సు తృప్తితో వున్నావేమో, ఆ తృప్తి కూడా నీకు దక్కకుండా...

ఒక్కసారిగా వచ్చిన దురుసు గాలి, నా చేతిలోంచి నా రేఖ లెటర్‌ను ఎగురేసుకు పోయింది.

అప్పుడు ఎదురుగా వున్న రూం కర్టెయిన్ గాలి వీయడంతో ఒక్కసారిగా పైకి లేచింది.

పరదా చాటుగా,

రేఖ కాళ్ళు, వెండి మువ్వలతో

గాలిలో కాళ్ళు అటూ యిటూ ఊగుతూ చిరు మువ్వల సవ్వడి ఎలాగో వినిపించ సాగింది.

నాకేం అర్థం కావడం లేదు.

అంతా అయోమయంగా వుంది.

గాలి విసురుకు రేఖ శరీరం కూడా గడియారంలో పెండ్యూలంలా సీలింగ ఫ్యాను నుండి వ్రేలాడదీయబడిన తాడుతో అటూ ఇటూ ఊగుతుంటే...

ఇంకా అయోమయంగా వుంది.

నా మనస్సేమో పైకి పైపైకి లేచి

పోతుంటే, అరే, అదేమిటి

నా శరీరం నా మనస్సు మాట వినకుండా నన్ను వదిలి బాల్కనీ రెయిలింగ్ నుండి వంగి క్రిందికి వంగిపోతూంటే,

'రేఖా ప్లీజ్


నా మనస్సు మూలుగుతూంది.

## 'మొరటోడు...' ఫ్లాప్! నా కెరీర్‌కు డ్రాప్!!

"ఇటీవల విడుదలైన నా చిత్రం 'మొరటోడు నా మొగుడు' ఎందువలన అంతగా ఫ్లాప్ అయిందో నాకు అర్థం కాలేదు. తమిళంలో ఈ సినిమా సూపర్ హిట్ అయింది. అదే సినిమా వున్నది వున్నట్లు తెలుగులో తీస్తే సూపర్ ఫ్లాప్ అయింది. ఈ సినిమా నాకు, నిర్మాత, దర్శకుడు, రచయిత (సంభాషణ) అందరికీ కొత్త అనుభవం నేర్పింది" అన్నారు డా. రాజశేఖర్.

క్రాంతికుమార్ దర్శకత్వంలో నటిస్తున్న 'అక్క మొగుడు' సినిమా ప్రారంభ సమయం (ఏప్రిల్ 30)లో డా. రాజశేఖర్ పాత్రికేయులతో 'మొరటోడు నా మొగుడు' సినిమా అపజయం గురించి ఒకసారి పరిశీలన చేసుకున్నారు. ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో ఆ చిత్రాన్ని బుర్లి సుబ్బారావు నిర్మించిన విషయం పాఠకులకు గుర్తుండే వుంటుంది.

తమిళంలో 'చిన్న తంబి' అంటే తెలుగులో వచ్చిన వంటి తర్వాత అంత హిట్ అయిన సినిమా 'మొరటోడు...' కథని రాజశేఖర్ చెప్పారు. మొదట ఈ సినిమా కథను కె.ఇ. ప్రసాద్ చూసి తన బేనరుకు నటించమని అడిగితే, అప్పుడు సినిమా చూసిన తనకు పెద్దగా నచ్చలేదని , ఆ కారణంగానే ఆ నిర్మాతతో ఆ కథ చేయడానికి తను అంగీకరించలేదని రాజశేఖర్ చెప్పారు. ఆ విధంగా మానుకున్న ఆ చిత్రం కథను బుర్లి సుబ్బారావుగారికి బాగా నచ్చి తనతో తీయడానికి హక్కులు తీసుకున్నారని రాజశేఖర్ చెప్పారు. కోదండరామిరెడ్డిగారికి, రచయిత పరుచూరి గోపాలకృష్ణగారికి కూడా ఆ చిత్రం కథ బాగా నచ్చడంతో వారు తప్పకుండా హిట్ అవుతుంది అని ప్రోత్సహించడంతో అంతమంది



డా. రాజశేఖర్

నమ్మకంగా చెబుతున్నప్పుడు తప్పకుండా తెలుగులో కూడా మంచి హిట్ అవుతుందేమో అనే విశ్వాసంతో తాను అప్పుడు అంతకుముందు వద్దన్న కథను చేయడానికి అంగీకరించినట్లు రాజశేఖర్ చెప్పారు. తమిళంలో పెద్ద హిట్ అయిందికదా, సహజంగా తెలుగులో కూడా హిట్ కావచ్చు అన్న "హిట్" ప్రేరణ ముఖ్యంగా ఆ కథ చేయడానికి పురికొల్పిందని ఆయన చెప్పారు. అయితే తమిళంలో వున్నది వున్నట్లు వాళ్ళ నేటివిటికి తగినట్లుగానే తీసిన 'వంటి' చిత్రం ఇక్కడ కూడా సూపర్‌హిట్ అయినప్పుడు అదే అనుసరణతో 'మొరటోడు...' మూలకథను, కథనాన్ని యథాప్రకారం ఫాలో అయి తీసిన ఈ సినిమా ఎందువలన ప్రేక్షకుల ఆదరణకు నోచుకోలేకపోయిందో తాను ఇప్పటికి అర్థం చేసుకోలేకపోయానని రాజశేఖర్ అన్నారు. ఈ సినిమా రూపొందించడంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత, దర్శకులు, రచయిత, ప్రతి టెక్నీషియన్, నటీనటులు కష్టపడి పనిచేసినట్లు రాజశేఖర్ చెబుతూ సినిమా అపజయంలో యూనిట్‌లోని ఏ ఒక్కరి కృషి లోపం జరగలేదని చెప్పారు. ఏమైనా ఈ సినిమా అపజయం తన ప్రస్తుత కెరీర్‌కు ఒక మచ్చలా నిలిచిందని రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. ఈ అపజయంలో ఆ సినిమా నిర్మాత, దర్శకులు మరెవ్వరు బాధ్యులు కారని, అది తన దురదృష్టంగా దానికి తనే కారకుడుగా రాజశేఖర్ చెప్పుకున్నారు.

— ఎల్. బాబురావు